క్లుప్తంగా

సన్మానం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం డివిజన్–2 ఇరిగేషన్‌శాఖలో 40 ఏళ్లుగా గ్యాంగ్ మేన్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొంతం బొంద్యాలు పదవి విరమణ చేశాడు. శనివారం ఇరిగేషన్‌శాఖ అన్నారం కార్యాలయంలో ఈఈ యాదగిరి ఆధ్వర్యంలో శాలువా కప్పి మెమొంటోతో బొద్యాల దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సతీశ్, ఏటీఏఈఈ ప్రెసిడెంట్ రామ్‌చందర్, ఏఈఈలు రాజేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

కేటీకే ఒకటో గనిలో..



భూపాలపల్లి రూరల్: కేటీకే ఒకటవ గనిలో పదవి విరమణ పొందిన కార్మికులను శనివారం ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రెటరీలు సోతుకు సమ్మయ్య, భారత శ్రీనివాస్, రాయమల్లు, శ్రావణ్, దుర్గం రవి, మల్లేష్, ప్రభాకర్, రఘునాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం భూపాలపల్లి ఏరియాకు వచ్చిన ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్‌ను మర్యాద పూరక్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సింహగర్జనకు తరలిరావాలి

టేకుమట్ల: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు (ఆదివారం) హైదరాబాద్‌లో తలపెట్టిన మాల మహానాడు సింహగర్జన మహాసభకు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు కోండ్ర ఓదెలు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితులను విడదీసే ప్రయత్నంలో చేస్తున్న కుట్రనే ఎస్సీ వర్గీకరణ అని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదమ్ములవలే ఉన్న దళితులను విడదీసే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆయన వెంట జిల్లా నాయకుడు బట్టల మొగిళి ఉన్నారు.

'నిరుద్యోగులను ఆగం చేసిన బీఆర్ఎస్'

కాటారం: రాష్ట్రాన్ని పదేళ్ల పాలనలో భ్రష్టుపట్టించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకే చెందుతుందని యూత్ కాంగ్రెస్ మహాముత్తారం జనరల్ సెక్రటరీ రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి బీఆర్ఎస్ ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ఆగం చేశారని ఆరోపించారు.

'ప్రతిష్టను దిగజార్చేందుకే ఫుడ్ పాయిజన్ కుట్ర'

మల్హర్: ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే విధంగా, విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్ ఫుడ్ పాయిజన్ కుట్రకు తెర లేపారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రెండు రోజుల్లో దీని మీద పూర్తి విచారణ చేపించి దోషులను కఠినంగా శిక్షించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



రేగొండ: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్ర శేఖరయ్య శనివారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా జారి కింద పడిపోయాడు. దీంతో ఆయన నడుముకు, కాలుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని తోటి కార్మికులు కోరారు.

ఏబీవీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



భూపాలపల్లి రూరల్: ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గోల్కొండ సురేష్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దసరాపు వంశీ, కృష్ణ, వాసలా రాకేష్, సందీప్ ఉన్నారు.

గన్నీ సంచుల కొరత



టేకుమట్లలో ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న రైతులు



కాంటాలు కాని ధాన్యం బస్తాలు

అరకొరగా ధాన్యం కొనుగోళ్లు
- ప్రతికూల వాతావరణంతో ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అరకొరగా ధాన్యం కొనుగోలు కొనసాగుతున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేర్చి 15 నుంచి 20రోజులకు పైగా కావస్తున్నా కొనుగోళ్లు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని రాఘవరెడ్డిపేట, వెల్లంపల్లి, గుమ్మడవెల్లి, వెల్లంపల్లి, ఎంపేడు, వెలిశాల, రామకిష్టాపూర్, పంగడిపల్లి, వెంకట్రావుపల్లి కొనుగోలు కేంద్రాల్లో స్థలం సరిపడా లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ, ప్రధాన రోడ్ల వెంట కిలోమీటర్ల మేర ధాన్యాన్ని ఆరబోస్తూ నరకం చూస్తున్నారు.

గన్నీ సంచులు లేక ఇబ్బందులు

మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు గన్నీ సంచులను సరిపడా పంపిణీ చేయకపోవడంతో ధాన్యాన్ని కుప్పలుగా పోస్తూ, ఆరబోస్తూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీఏసీఎస్ అధికారుల తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తేమ వచ్చిన ధాన్యం ప్రస్తుతం ప్రతికూల వాతావరణంతో తేమ శాతం పడిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలో రైతులు

రెండు రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా ఎప్పుడు వర్షం కురుస్తుందోనని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. రూ.వేలల్లో ఖర్చు చేస్తూ టార్పాలిన్లను కొనుగోలు చేసి ధాన్యంపై కప్పుకుంటున్నారు. శనివారం కురిసిన స్వల్ప వర్షానికి కొంత మంది రైతుల ధాన్యం సైతం తడిసింది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అధికారుల నిర్లక్ష్యం మూలంగా కొనుగోలు కేంద్రాల్లోనే ఉండడంతో ధాన్యం వర్షానికి తడిసి ధర పడిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్వింటాకు 5 నుంచి 6కిలోల తరుగు..

నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతుల కష్టాలను ఆసరాగా చేసుకుని 41 కిలోల బస్తాకు కొనుగోలు కేంద్రంలోనే 43కిలోల తూకాన్ని వేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. బస్తాకు 2కిలోల తరుగు అనగా క్వింటాకి దాదాపు 5నుంచి 6కిలోల తరుగును తీస్తూ మిల్లర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఒక్కో క్వింటాకి ఇంత తరుగా అని ప్రశ్నిస్తే తాము మీ ధాన్యాన్ని కొనలేమంటూ వెనక్కి పంపే ప్రయత్నం చేయడంతో చేసేందేంలేక రైతులు ఎంత తరుగుకైనా నష్టాలకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇంత జరుగుతున్నా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, పీఏసీఎస్ అధికారులు పట్టించుకోకపోవడంపై లోపాయికారి ఒప్పందం అంటూ పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను మోసం చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

25 రోజులుగా ఉంటున్నాం..



గన్నీ సంచులు లేకపోవడంతో 25 రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే ఉంటున్నాం. ఉదయం ఆరబోస్తూ, సాయంత్రం కుప్పలు చేస్తున్నాం. కేంద్రంలో గన్నీ సంచులు లేకపోవడంతో సగం ధాన్యం కల్లంలోనే ఉంది. వర్షం వచ్చేటట్లు ఉంది తొందరగా సంచులు ఇచ్చి కాంటాలు పెట్టుకోవాలి.

– ఇండ్ల రాజమల్లు, రైతు రామకిష్టాపూర్(టీ)

తరుగు దందాను అరికట్టాలి



రైతులు కల్లాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రైతులను పట్టించుకున్న వారే లేరు. కొనుగోలు కేంద్రం ప్రారంభమైనా కాంటాలు మాత్రం పెట్టకపోవడంతో కల్లాల్లోనే రైతులు ఉంటున్నారు. ఇక వర్షాలు ఉన్నాయని తెలియడంతో రూ.వేలల్లో ఖర్చు చేసి పరదాలను కొంటున్నాం. కనీసం పరదాలను కూడా అందించడం లేదు. మిల్లుల్లో క్వింటాల్‌కి 5నుండి 6కిలోల తరుగు దందాను అరికట్టాలి.

– తిప్పరవేని బాలు, రైతు టేకుమట్ల

తిప్పలు తప్పడం లేదు



వడ్లకు తేమ శాతం వచ్చినా కొంటలేరు. ఇప్పటికీ 15 రోజులుగా కల్లంలోనే ఉంటున్నా. వర్షం వస్తే ధాన్యం తడుస్తుందనే భయం ఉంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకునేందుకు తిప్పలు తప్పడం లేదు. సంచులు ఇప్పటి వరకు ఇయ్యలేదు. కాంటాలు పెట్టడం లేదు.

– మేకల రాములు, రైతు టేకుమట్ల

విద్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



వంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి: పేద విద్యార్థులు చదువుకునే సర్కారు విద్య వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తినే భోజనాన్ని, బియ్యం, కూరగాయలు, కోడిగుడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అందించే భోజనంలో కాంట్రాక్టర్లు నాణ్యమైన సరుకులు అందించడం లేదని కనీసం అట్టి సరుకులను తనిఖీ చేసే అధికారులే కరువయ్యారన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులు చల్లని నీళ్లతో స్నానాలు చేస్తున్నారని వేడి నీరు అందించడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యను అందించామని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినప్పటికీ ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రిన్సిపాల్ శారద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు, జిల్లా నాయకులు జోరుక సదయ్య, కొడారి రమేశ్, నాయకులు దానవేణి రాములు, రవి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'విద్యార్థులను పట్టించుకోని సర్కారు'



పాఠశాలను బైకాట్ చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వామపక్ష విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల జోసెఫ్, కుమ్మరి రాజు అన్నారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలను బైకాట్ చేసి విద్యార్థులను ఇంటికి పంపించారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి



టేకుమట్ల: మాట్లాడుతున్న హెడ్ కానిస్టేబుల్



మల్హర్: అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

- హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రావు

టేకుమట్ల: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని హెడ్ కానిస్టేబుల్ బెల్లంకొండ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని గుమ్మడవెల్లిలో పౌరహక్కులపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగిస్తే చట్టంలో శిక్షార్హులన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలను గ్రామాలకు దూరంగా ఉంచడం, వారిపై అంటరానితనాన్ని ప్రదర్శిస్తే కేసుల పాలవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, పృధ్వి, కుమార్, కానిస్టేబుల్ నాగరాజు ఉన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయాబ్ తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ...షెడ్యూల్డ్ కులాల సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్ఐ నరేశ్, గ్రామ కార్యదర్శి సతీశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా చేపట్టాలి

- జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి



వివరాలు తెలుసుకుంటున్న కుమారస్వామి

కాటారం: 21వ అఖిల భారత పశుగణలో భాగంగా పశువుల లెక్క నమోదు పక్కాగా చేపట్టాలని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి పశువైద్య సిబ్బందికి సూచించారు. కాటారం మండలంలో కొనసాగుతున్న పశుగణన ప్రక్రియను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువుల లెక్కింపు విధానం, మొబైల్‌లో డేటా నమోదుపై ఆరా తీశారు. ఆన్‌లైన్ డేటా నమోదులో సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఇంటింటా తిరిగి పశువుల వివరాలను అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. పశువైద్యాధికారి వెంట మండల పశు వైద్య సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్

కాళేశ్వరం: కాళేశ్వరాలయంలో కార్తీకమాసం సందర్భంగా పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయంలో విధులు నిర్వర్తించి పలువురు మన్ననలు పొందారని వారి సేవలు భేష్‌గా ఉన్నాయని మాజీ సర్పంచ్ మెంగాని మాధవి, మాజీ ధర్మకర్తలు మెంగాని అశోక్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీఅన్నమాచార్య, శ్రీరాజరాజేశ్వర, శ్రీనృసింహా, లలిత సేవా సమితి సభ్యులు నిత్యం భక్తుల సేవలో తరించారన్నారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

రేగొండ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెన్నాపూర్ మీదుగా శనివారం ఇసుకను తరలిస్తుండగా చలివాగు బ్రిడ్జి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ట్రాక్టర్‌ను ఆపి ఇసుక తరలింపునకు అనుమతి పత్రాలు చూయించాలని అడిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో పట్టుకుని రేగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

- గాదె రమేశ్



మాట్లాడుతున్న గాదె రమేశ్

కాటారం: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరం అని మహదేవపూర్ సమీకృత సలహ పరీక్షా కేంద్రం(ఐసీటీసీ) కౌన్సిలర్ గాదె రమేశ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారామెడికల్ విద్యార్థులకు ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాదె రమేశ్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ నిర్వచనం, వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాలు, అపోహలు తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. వైద్యురాలు వందన, గిరిజన బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ వెంకన్న, స్టాఫ్‌నర్స్ అభినయ, ఇన్‌స్ట్రక్టర్ రుచిత, విద్యార్థులు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

- తహసీల్దార్ సయ్యద్ సర్వర్

పలిమెల: విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని పంకెన కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పరిసరాలు, కిచెన్, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చేశారు. ఎంఈఓ వెకటరాజు, ఎస్ఓ భవాణి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

మహదేవపూర్ ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజు

కాళేశ్వరం: మహదేవపూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ పంతకాని రాజు 'ఆదివాసీ జీవన కళా సౌందర్యం'పై తీసిన ఫొటోకు అవార్డు లభించింది. 132వ 'వరల్డ్ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ డే' సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్–ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా' సహకారంతో నిర్వహించిన ఫొటో కాంటెస్ట్‌లో అవార్డు లభించినట్లు ఆయన తెలిపారు. శనివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆవరణలో ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ గంగాధర రావు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ బాధ్యులు డాక్టర్ మధు బాబు తదితరులు సర్టిఫికెట్, మెడల్ అందజేసినట్లు తెలిపారు.

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి



టేకుమట్ల: విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ఉపాధ్యాయులు



మొగుళ్లపల్లి: విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

- ఎంఈఓ సుధాకర్

టేకుమట్ల: విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాధికారి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు గణిత ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు ప్రతిభా పాఠవాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందించి, అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి సుధాకర్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి విద్యతో పాటు నైపుణ్యాలలో మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వింద్యారాణి, కవిత, ఆనంద్, ప్రకాష్,చ రవిందర్, సదయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గణిత ఫోరం ఆధ్వర్యంలో..

మొగుళ్లపల్లి: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి 10వ తరగతి గణిత ప్రతిభా పోటీలు నిర్వహించారు. మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ మొట్లపల్లి పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి పి.అభిరామ్ మొదటి స్థానంలో నిలవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నరసింహస్వామి,సంపత్ కుమార్, వీరయ్య, ఉమా రాణి, కే రవీందర్, గ్లోరీ రాణి, శోభారాణి, కవిత, రవి ప్రసాద్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మల్హర్: నివాళులర్పిస్తున్న పుట్ట మధు



టేకుమట్ల: పరామర్శిస్తున్న మంద కృష్ణమాదిగ

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన అనసూరి రాజేశ్వరి, తమ్మిశెట్టి వెంకట నారమ్మ, లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ శనివారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, అన్నమనేని మధుసూదన్‌రావు, బాపు, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూడపాక శ్రీనివాస్ తాత దూడపాక లింగయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన అధ్యక్షుడు, జాతీయ నాయకులు మంద కృష్ణ మాదిగ పరామర్శించారు. జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి, రాంచందర్, శంకర్, సంపత్, సంగి రవి, తదితరులు ఉన్నారు.

రైతువేదికలో 'రైతు పండుగ'



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, నాయకులు

కాటారం: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం రైతుపండుగ కార్యక్రమం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఏఓలు రాజన్న, సరిత, దివ్యజ్యోతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కొట్టె శ్రీహరి, కొట్టె ప్రభాకర్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.